# స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం

## అంబేడ్కర్–గాంధీ చర్చను అర్థం చేసుకోవటం ఎలా?

**రాజ్‌మోహన్ గాంధీ**

అనువాదం

**టంకశాల అశోక్**

ఎమెస్కో

# స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం

అంబేద్కర్–గాంధీ చర్చను అర్థం చేసుకోవటం ఎలా?

## 1

**అ**స్పృశ్యతను వ్యతిరేకించే హిందువుల బృందం ఒకటి ఆ అంశంపై ప్రసంగించవలసిందిగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను 1936 లో లాహోర్‌కు ఆహ్వానించింది. ఆ నగరం అప్పుడు భారతదేశంలోనే ఉండేది. ఆయన తన ప్రసంగాన్ని *కుల నిర్మూలన* (*అన్నిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్*) అనే పేరుతో రాసి, ఆ పాఠాన్ని వారికి ముందుగానే పంపారు. అది చదివిన నిర్వాహకులు తనకు ఆహ్వానాన్ని రద్దు చేశారు. డాక్టర్ అంబేద్కర్ తన ప్రసంగం చివరిలో, తాను హిందూ మతం నుంచి నిష్క్రమించదలచుకున్నట్లు ప్రకటించడం అందుకు కారణం. ఆహ్వానం రద్దుకు నిరసనగా ఆయన తన ప్రసంగపాఠాన్ని పుస్తకంగా ప్రచురించారు. దానిపై గాంధీ తన పత్రిక *హరిజన్*‌లో వెంటనే వ్యాఖ్యానం ఒకటి రాశారు. అందుకు అంబేద్కర్ తన సమాధానం పంపారు.

భారతదేశపు ఇటీవలి చరిత్రలో అంబేద్కర్ కులనిర్మూలన ఒక ప్రముఖమైన రచన. అది అనేకమార్లు పునర్ముద్రణ పొందింది. పలు భాషలలోకి అనువాదమైంది. అంబేద్కర్–గాంధీ ఉత్తర ప్రత్యుత్తరాలను కూడా కొన్ని ఎడిషన్లలో చేర్చారు. 2014 మార్చిలో ఢిల్లీకి చెందిన నవయాన అనే సంస్థ ఒక కొత్త ముద్రణను తీసుకువచ్చింది. అందులో అంబేద్కర్ పాఠానికి ముందు అరుంధతీ రాయ్ 'ద డాక్టర్ అండ్ ద సెయింట్' పేరుతో 153 పేజీల సుదీర్ఘ వ్యాఖ్యానం ఒకటి రాశారు. దానిని పుస్తకానికి ముందుమాట అన్నారు.

నా ఈ చిన్నపుస్తకం అరుంధతి వ్యాఖ్యకు స్పందన. అదే సమయంలో, అంబేద్కర్–గాంధీల మధ్య జరిగిన చారిత్రకమైన చర్చతో ఈ పుస్తకానికి పరోక్ష సంబంధం ఉంది. ఆ కాలానికి, మన కాలానికి మధ్య చాలా దూరం ఉంది. గాంధీ హత్య జరిగి ఇప్పటికి సుమారు ఏడు దశాబ్దాలు కాగా, అంబేద్కర్ దాదాపు ఆరు దశాబ్దాల క్రితం 1956 లో మరణించారు.

వారిద్దరి మధ్య 1920 లలో మంచి సంబంధాలుండేవి. కాని వాటికి వ్యక్తిగతకోణం లేదు. ఆ రోజుల్లో వారెప్పుడూ కలుసుకోలేదు. అయితే దళితుల స్థితిగతుల పట్ల గాంధీ ఆందోళనను అంబేద్కర్ ప్రశంసించేవాడు. గాంధీ ప్రవేశపెట్టిన సత్యాగ్రహ పద్ధతిని కూడా ఆయన మెచ్చుకునేవాడు. కాని 1930 లు వచ్చేసరికి ఇరువురి మధ్య తీవ్రమైన వాదాలు బయలుదేరాయి. చరిత్రకారుల దృష్టితో చూసినప్పుడు ఆ వాదాలలో ముఖ్యమైన విషయాలు అనేకం ముందుకు వచ్చాయి.

ఆ వాద ప్రతివాదాలను గమనించినప్పుడు మనకు చరిత్రలోని గాంధీ, అంబేద్కర్ ఇద్దరు శక్తిమంతులైన వ్యక్తుల గురించి అర్థమవుతుంది. అంతేగాక, భారతసమాజంలో ఇంకా కొనసాగుతున్న లోపాలేమిటి? దేశ స్వాతంత్ర్య సాధన–సామాజిక న్యాయం అనే లక్ష్యాల మధ్య ఇరవయ్యవ శతాబ్దపు ప్రథమార్ధంలో తలెత్తిన ఘర్షణాత్మక స్థితి ఎటువంటిది? అనే అవగాహనలు కూడా మనకు కలుగుతాయి.

అంబేద్కర్, గాంధీలు తీవ్రమైన వాగ్యుద్ధాలకు తలపడటానికి కొద్ది ముందు, వారి ముఖాముఖి సమావేశం 1931 లో ముంబాయిలో జరిగింది. వారి వాదప్రతివాదాలు బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశపు భవితవ్యంపై లండన్‌లో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించినప్పుడు మొదలయ్యాయి. తర్వాత 1932 లో పూణె జైలులో కొనసాగాయి. అపుడు గాంధీని బ్రిటిష్ ప్రభుత్వం యెరవాడ జైలులో నిర్బంధించింది. అక్కడ ఉభయుల చర్చలు ఫలప్రదమయ్యాయి. కాని 1930 ల మధ్య కాలం నుంచి తిరిగి ఉధృతమైన వాదాలు నడిచాయి. ఇవి ప్రధానంగా పత్రికలలో కన్పిస్తాయి.

బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడుతుండిన గాంధీని అధికారులు తరచు జైలులో నిర్బంధిస్తున్నందున ఆ చర్చలకు మధ్య మధ్య విరామం ఏర్పడేది. 1932–34 మధ్య, 1942–44 మధ్య గాంధీ జైలువాసంలో ఉన్నారు. దేశ స్వాతంత్ర్యం కన్నా సామాజిక న్యాయంతో కూడిన ప్రజాస్వామ్యం ముఖ్యమని భావించిన అంబేద్కర్ ఎన్నడూ జైలుపాలు కాలేదు. తనను ప్రభుత్వం 1942–45 మధ్య వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా కూడా నియమించింది.

*కాంగ్రెస్, గాంధీ అస్పృశ్యుల కోసం చేసిందేమిటి?* (*వాట్ కాంగ్రెస్ అండ్ గాంధీ హ్యావ్ డన్ టు ద అన్‌టచబుల్స్*) పేరిట అంబేద్కర్ 1945 వేసవిలో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. అందులో గాంధీపైన, తన నాయకత్వాన నడుస్తున్న కాంగ్రెస్ ఉద్యమం పైన తీవ్రమైన దాడి ఉంది. దేశ విభజనను నివారించేందుకు 1944 నుంచి శ్రమిస్తుండిన గాంధీ ఆ దాడికి స్వయంగా సమాధానమివ్వలేదు. కాని, *అంబేద్కర్ రెఫ్యూటెడ్* పేరుతో అందుకు జవాబు రాసిన చక్రవర్తి రాజగోపాలాచారిని అందుకు ప్రోత్సహించారు.

1947–48 సంవత్సరాల్లో గాంధీ–అంబేద్కర్‌ల మధ్య అనూహ్యమైన రీతిలో సయోధ్య వంటిది కుదిరింది. ఏ కోణం నుంచి చూసినా అది చెప్పుకోదగ్గదే. ఆ సయోధ్యకు ప్రధానమంత్రి జవాహర్‌లాల్ నెహ్రూ, ఉపప్రధాని వల్లభ భాయ్ పటేల్ సూత్రధారులు. ఆ తర్వాత స్వతంత్ర భారతదేశపు తొలి మంత్రివర్గంలో అంబేద్కర్ చేరటమేగాక, రాజ్యాంగ రచనా కార్యానికి నేతృత్వం వహించారు. దాని ఫలితమే 1950 నాటి భారత రాజ్యాంగం.

అయితే అంబేద్కర్ 1951 లో మంత్రివర్గం నుంచి వైదొలగారు. 1952 లో, తర్వాత 1954 ఉపఎన్నికలలో కాంగ్రెస్‌పై పోటీ చేసి ఓడిపోయారు. 1956 లో తన మరణానికి కొద్ది ముందు లక్షలాదిమంది దళితులతో పాటు హిందూ మతం నుంచి నిష్క్రమించి బౌద్ధాన్ని స్వీకరించారు.

గాంధీ–అంబేడ్కర్‌ల సంబంధం ఏ విధంగా చూసినప్పటికీ చాలా ఆసక్తికరమైంది. దానిపై ఇప్పటికే చాలామంది రాశారు. మునుముందు కూడా రాస్తారు. నేను కూడా లోగడ1995 లో, 2006 లో రాశాను. అంబేడ్కర్–గాంధీల చర్చలు ఆ సంబంధాలలో ఒక ముఖ్య భాగం. దానికదిగా చూసినా ఆ చర్చకు అమితమైన ప్రాముఖ్యం ఉంది. ఆ చర్చలపై మరిన్ని చర్చలు, విశ్లేషణలు వెలువడ్డాయి, ఇకముందు కూడా వెలువడతాయి.

ఈ పుస్తక రచనలో నా ఉద్దేశం అంబేడ్కర్–గాంధీ చర్చను విశ్లేషించటమో, మదింపు చేయటమో కాదు. అయితే ఆ చర్చను అవగాహన చేసుకునేందుకు ఈ రచన ఉపకరిస్తుందనుకుంటాను. ఆ ఇద్దరు నాయకుల మధ్య ఉండిన సంబంధాలపై దృష్టి పెట్టినా, ఆ సంబంధాన్ని విశ్లేషించటం మాత్రం ఇందులోని ముఖ్యోద్దేశం కాదు.

గాంధీ లేదా అంబేడ్కర్‌ల వాదాలకు ఎదురు వాదాలు చేయటం నా ఆలోచన కాదు. వారిద్దరు మరొక స్థాయికే గాక, మరొక కాలానికి చెందినవారు. కాని, అరుంధతీ రాయ్‌కి తగిన సమాధానం ఇవ్వాలని మాత్రం నేను భావిస్తున్నాను. అది దుస్సాహసమైతే కావచ్చు. ఆమె పుస్తకం ‘ద డాక్టర్ అండ్ ద సెయింట్‘ ను చాలామంది కొన్నారు. వారది చదువుతారనటంలో సందేహం లేదు. ఆ పుస్తకంలోని భాగాలు పత్రికల్లో, ఇంటర్నెట్‌లో విరివిగా వెలువడ్డాయి. తన రచన గురించి ఆమె చేసిన ప్రసంగాలకు శ్రోతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆ వార్తలు విస్తారంగా వెలువడ్డాయి.

అరుంధతి పుస్తకం చదవాలని నేను మొదట అనుకోలేదు. కాని అందులోని భాగాలను పత్రికలలో చూసినపుడు, ఆమె గాంధీ గురించి అసంబద్ధమైన, నలుగురూ ఎగతాళి చేసేందుకు సరిపోయే, దిష్టిబొమ్మ లాంటి చిత్రం ఒకటి తయారుచేసినట్లనిపించింది. దానితో చివరకు పుస్తకం సంపాదించి చదివాను. దాని గురించి నా అభిప్రాయమేమిటని అందరూ ఎట్లాగూ అడుగుతారు. పైగా, ఒక రచనను పూర్తిగా చూడకుండా దాని గురించి ఒక అభిప్రాయం ఏర్పరచుకోవటం సరైంది కాదు.